
కాలుకాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడతను. వదనంలో ఆతృత, ఆందోళన... అశాంతిగా గది గుమ్మం దగ్గరకు పలుమార్లు వెళుతున్నాడు. మూసివున్న తలుపుల్ని చూసి నిరాశగా వెనక్కు తిరిగొస్తున్నాడు ...కాసేపు వరండా గట్టుమీద కూర్చుంటాడు. అంతలో నేలేచి పచార్లు ప్రారంభిస్తున్నాడు. ఇబ్బందిగా కదులుతున్నాడు.




నేను వచ్చేప్పటికే అక్కడవున్నాడతను. నేను వచ్చినప్పటినుంచీ అతని వరుస గమనిస్తూనే వున్నాను. అక్కడ వున్నవాళ్ళందరిలో అతనొక్కడే మగవాడు.

ఉదయం పదిగంటలకే ఎండ మాడ్చేస్తోంది. ఉక్క గుమాయించేస్తోంది. ఐనా అదేమీ పట్టించుకునే స్థితిలో లేరు ఎవరూను.

అది మెటర్నిటీ వార్డు. బయట వరండాలో రంగు మాసిపోయిన ఓ పొడుగు బల్లమీద ముగ్గురు స్త్రీలు కూర్చున్నారు. క్రింద గచ్చుమీద మరో ఇద్దరు ఆడవాళ్ళు కూర్చున్నారు. వారికి చేరువలో నేనూ నేలపైన చతికిలబడ్డాను. ఆ యువకుడు మాత్రం అసహనంగా తిరుగుతూనే వున్నాడు. అతని చూపులు లేబర్‌రూమ్ తలుపులమీదే వున్నాయి.

గదిలోనుంచి అప్పుడప్పుడు వినవస్తున్న ప్రసవ వేదనలు, బాధతో కూడిన ఆర్తనాదాలూ అందరి గుండెలనూ గుభేలుమనిపిస్తున్నాయి. నాకూ మనసులో ఆందోళనగానే వుంది. మా కోడలికి నొప్పులొస్తుంటే ఆ గదిలోకి పంపించి గంట సుమారయింది. ఇంకా ప్రసవం కాలేదు. మధ్య మధ్య యెగసివస్తోన్న నొప్పులకు భరించలేక పిల్ల పెడుతూన్న కేకలు వినిపించినపుడల్లా నా గుండెలు బేజారెత్తిపోతున్నాయి. పైగా అదే మొదటి కాన్పేమో సుఖ ప్రసవం కావాలనీ, ఏ ప్రమాదమూ జరగకూడదనీ వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నాను మనసులోనే.

అక్కడ వున్న వారందరి వదనాలలోనూ అదే ఆతృత, ఆందోళనా కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి.

నేలపైన కూర్చున్నవారిలో ఒకామె అంది నాతో— "రెండో కాన్పుతోటే ఆపరేషన్ చేయించేసుకుంటానని మొత్తుకుంది కుర్రది. అల్లుడు పడనిచ్చాడు కాదు. ఇద్దరూ ఆడపిల్లలే. మగపిల్లాడు పుట్టేదాకా ఆ వూసే ఎత్తొద్దన్నాడు."

"నీ కూతురా?" అడిగాను తెలుస్తూనే వున్నా.

ఔనని తలూపింది. "పిల్ల అసలే నీరసంగా వుంది. కాన్పు ఎలా అవుతుందోనని భయంగా వుంది" అందామె. తల్లడిల్లే తల్లి హృదయం ఆమె గొంతులో ధ్వనించింది.

"పరవాలేదులే" అన్నాను ధైర్యం చెబుతూ.

"నీ కూతురా, కోడలా?" ప్రశ్నించింది నన్ను.

ఆ యువకుడు గట్టుమీద కూర్చున్నవాడు కాస్తా లేచి అసహనంగా పచార్లు ప్రారంభించాడు మళ్ళీ. అతని ముఖంలో ఆతృత, ఆందోళన అందరికంటె కొంచెం ఎక్కువపాళ్ళలోనే కనిపిస్తున్నాయి. మధ్య మధ్య హడావుడిగా గుమ్మంవరకు వెళ్ళడమూ, మూసిన తలుపులు చూసి నిరాశతో వెనక్కి మళ్ళడమూ జరుగుతోంది. లేబర్ రూంలోనుంచి స్త్రీల అరుపులు వినిపించినప్పుడల్లా గుమ్మంవైపు ఆతృతగా చూస్తున్నాడు. ఉండి వుండి అశాంతిగా పచార్లు చేస్తున్నాడు.

అతన్ని చూస్తుంటే జాలివేసింది నాకు.

అటువంటి సమయాల్లో మగవాడు అసలు గుండెనిబ్బరం చేసుకోలేడు. ఆడదాని సంగతి వేరు.... బహుశా అతని భార్య లోపల వుండివుంటుంది. అందుకే అంత కంగారు, ఆందోళనాను.... తలుపు చప్పుడైనప్పుడల్లా ఆతృతగా అటుచూస్తున్నాడు. ఆ తరువాత నిరాశతో తల త్రిప్పేసుకుంటున్నాడు.

అతను మధ్య మధ్య వాచీ చూసుకుంటూంటే నవ్వొచ్చింది నాకు. వెర్రివాడు! కక్కొచ్చినా, కల్యాణమొచ్చినా ఆగదన్నట్టు-పుట్టే ఘడియలొస్తే ప్రసవమూ ఆగదు. నేటి యువతరంలో పేరుకుపోయిన అసహనానికి చిహ్నంలా కనిపించాడతను నాకు పాపం. వెనుక ఆడవాళ్ళెవరూ లేరు కాబోలు సాయానికి! అందుకే పెళ్ళాన్ని లోపలికి పంపించి తాను పురిటినొప్పులు పడుతున్నాడు బయట!

లేబర్ రూం నుంచి వుండి వుండి ఏడుపులు, అరుపులూ వినిపిస్తున్నాయి. వాళ్ళ తాలూకు స్త్రీల గొంతులు వినిపించినప్పుడల్లా భయాందోళనలతో దేవుళ్ళకు మ్రొక్కేస్తున్నారు వరండాలో కూర్చున్న వారంతా.

కొంత సేపటికి గదిలోనుంచి ఓ నర్సు బయటకొచ్చింది.

హడావుడిగా ఆమె వద్దకు వెళ్ళాడు ఆ యువకుడు.

ఆమెతో ఏదో మాట్లాడాడు. ఆమె నొసలు చిట్లించుకుంటూ తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

వరండా చివరకు వెళ్ళి నిలుచున్నాడతను. ఓసారి వాచీ చూసుకున్నాడు.

"టైమెంతయింది బాబూ" అంటూ అడిగిందొకావిడ.

"పదీ ముప్పావు" అన్నాడు.

తలుపువైపు రెండడుగులు వేసి అంతలోనే ఆగిపోయాడు. మళ్ళీ వరండా చివరకు వెళ్ళి నిలుచున్నాడు అసహనంగా.

అతన్నిచూస్తూంటే నవ్వూ, జాలీ రెండూ కలిగాయి నాకు. ఎంతసేపటి నుంచి పడుతున్నాడో మానసిక వేదన. భార్యను వేధించి ప్రక్కమీదకు లాగినట్టు వుండదిప్పుడు. పురిటి నొప్పులతో పెళ్ళాం పెట్టే ఒక్కో అరుపూ మగవాడి గుండెను చీల్చేస్తుంది.... పాపం, అతని భార్యకు త్వరగా సుఖప్రసవం అయితే బావుణ్ణనిపించింది. ఆ టెన్షన్ నుంచి త్వరగా విముక్తి చెందితే తప్ప అతనికి పిచ్చెక్కేలా వుంది.

కాసేపటికి గది తలుపులు తెరుచుకున్నాయి.

ఆతృతగా అటువైపు అడుగులు వేశాడతను.

బయటకు వచ్చింది మరో నర్సు.

ఆమెను చూడడంతో అతని కన్నులు మెరిశాయి.

ఒక్క పురుకులో ఆమెను సమీపించాడు.

అతన్ని చూసి చిరునవ్వు నవ్విందామె.

ఇద్దరూ వరండా చివరకు వెళ్ళారు.

గబగబా ఏమిటో మాట్లాడాడు ఆమెతో. మందహాసంతో జవాబిస్తోందామె. ఇద్దరి మధ్యా రెండు నిముషాలు సంభాషణ జరిగింది.

కుతూహలంతో చెవులు రిక్కించాను గాని, ఒక్కముక్కా స్పష్టంగా వినిపించలేదు.

"థాంక్యూ.... థాంక్యూ...." అంటూ ఆమెచేయి నొక్కి, అతను హడావుడిగా వెళ్ళిపోయాడు. ముఖమంతా వెలుగు పులుముకుని.

కొన్ని సెకనులు అతనివంకే చూస్తూ నిలుచుండిపోయింది నర్సు.

ఆమె పెదవులపైన చెరగని ముద్రలా


## ఇంటింటికీ ఆనంద దీపావళి



నవ్వుల పువ్వుల్ని విరజిమ్మే ఒక హాస్య నవల, చంద్ర బొమ్మల కథ, ఎంకి పాటలకు "బాలి" చిత్రకల్పన, మీ అభిమాన రచయిత(త్రు)ల యింపైన కథలతో, దీపావళి కార్టూన్లు, సుమనోహరమైన కవితలతో సుమారు 300 పేజీలకు పైగా పూర్తి ఆఫ్‌సెట్ రంగుల ముద్రణతో, కలర్ ప్లేట్సుతో రంగుల హరివిల్లులా నేత్ర పర్వంగా వచ్చె మా దీపావళి (1982) ప్రత్యేక సంచిక మీ కరకమలాలను అలంకరిస్తుందని మా మనవి. వెల పది రూపాయలే!

ఏజెంట్లు తమ ఇండెంట్లను వెంటనే పంపాలి.

చిరునవ్వు.... కన్నులలో నక్షత్రాల కాంతి.

నాలో కుతూహలం హెచ్చింది. అతని భార్య ప్రసవించిందా ? అందుకేనా అంత సంతోషం ?

తిరిగి గదిలోకి వెళ్ళిపోబోతూన్న నర్సుకు ఎదురు వెళ్ళింది, అంతకుముందు నాతో తనగోడు చెప్పుకున్న ఒకావిడ.

"పాపం. వచ్చినప్పటినుంచి చూస్తున్నాను అతని వరస. తెగ కంగారుపడిపోతున్నాడు. అతని పెళ్ళాం ప్రసవించిందేంటమ్మా ? ఏం బిడ్డ ?" అని నర్సుని అడిగింది.

ఆ ప్రశ్నకు పులిక్కిపడినట్టు చూసింది నర్సు. "ఎవరి పెళ్ళాం ?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది

"ఇప్పుడు వెళ్ళిన కుర్రాడి పెళ్ళాం."

కుతూహలంతో చెవులు రిక్కించాను నేను.

నర్సు అదోలా చూసి, "అతని పెళ్ళాం ప్రసవిస్తోందని యెవరు చెప్పారు?" అంది ఆశ్చర్యంతో.

ఆ మాటతో మా అందరి ముఖాలలోనూ ఆశ్చర్యం.

ఆవిడ తెల్లబోతూ "అదేమిటమ్మా. రెండు గంటలనుంచి అతనంతగా కంగారుపడిపోతూ ఇక్కడ పడిగాపులు పడుంటే, అలా అంటావేమిటి?" అంది నర్సుతో.

అప్పుడే టీనేజ్ దాటిన నర్సు చెక్కిలి సిగ్గుతో ఎరుపెక్కింది.

"అతను పెళ్ళాం ప్రసవానికి రాలేదమ్మా.... నాకోసం వచ్చాడు" అంది సిగ్గుతో కూడిన చిరునవ్వుతో.

"ఆఁ!" తెల్లబోయామంతా.

"మరి అతని ముఖంలో ఆతృత..ఆందోళన...." అంది ఒకావిడ నమ్మలేనట్లుగా.

"అదా! సాయంత్రం ఎక్కడో డాన్సు ప్రోగ్రాం వుందట. టికెట్ బుక్ చేయమంటావా అని అడగడాని కొచ్చాడు...." నవ్వుతూ అంది నర్సు. "నేను ఉదయం నుంచీ లేబర్ రూంలో వుండిపోవడంతో, అవతల అడ్వాన్సు బుకింగ్‌కి టైమ్ అయిపోతోందని, నన్ను కలుసుకునే మార్గం తెలియక ఆరాటపడ్డాడట...."

మా కెవరికీ నోటమ్మట మాటలేదు !

మా అవస్థ గ్రహించినదానిలా, "మేము త్వరలో పెళ్ళాడబోతున్నాం" అని, నవ్వేసి లోపలికి వెళ్ళిపోయింది నర్సు.

